"If we are in the hands of a real master, all the things for 'man to be called man' gradually come out of themselves"

- Ravi Yelluripati

“మనము నిజమైన గురువు చేతులలో నున్నచో ’మనిషి మనిషి ననుపించుకొనుటకు’ కావలసినవన్నియు వాటంతటవే క్రమేపి సమకూరును.” పేజి 60 అమృత వర్షిణి

పూజ్య శ్రీ కే సీ నారాయణ గారికి మరియు అందరికి నా అభివాదము. నేటి సెమినార్ విశేషము పూజ్య బాబూజీగారు వ్రాసిన “శిక్షణా పద్ధతి’ అనే దివ్య సందేశము నుండి తీయబడినది. ఈ సందేశములో మానవుడు అసమత్వ స్థితికి దిగజారుట, దాని నుంచి బయట పడు మార్గము వెదుకుట, సత్ తత్వప్రాప్తి తీవ్రత వంటి విషయములు వెలుపరచి తద్వారా ఆశ్రయించిన గురువు యొక్క సాధనా పద్ధతి విషయములు వివరించారు. వీటిలో సంకల్ప శక్తి, గురువు ఎడల గల పరిశుద్ధమైన దైవత్వమును అభ్యాసీలోనికి ప్రవేశ పెట్టడము, హృదయముపై ధ్యానము, గురువుకి లోబడియుండు గుణము, సహజంగా అందరికి వొదిగి వుండు గుణము, “భగవంతునిపై ఆధారపడినామను భావన” అత్యుత్తమమైన శరణాగతియని, భగవంతునితో అంతరంగిక అనుబంధము కలిగి యుండుటయే భక్తియని, ఆధ్యాత్మిక పురోభివృద్ధి - ప్రాణాహుతి మరియు స్వయం కృషి అవసరములు, ప్రార్ధన యొక్క అవసరము, నీతివంతమైన వైఖరి - వంటి విషయములు వివరించారు. ఇవన్నీ మనందరికీ ఎంతో అమూల్యమైనవి. ఎపుడైతే మన సాధన పూజ్య బాబూజీగారు చెప్పినట్టుగా వుంటుందో ’మనిషి మనిషి ననుపించుకొనుటకు’ కావలసినవన్నియు వాటంతటవే క్రమేపీ సమకూరుతాయి!

పూజ్య బాబూజీగారి ఆధ్యాత్మిక విషయాల రచనలు ఎంతో సరళంగా వున్నా సూక్ష్మ విషయాన్ని గ్రహించడం సాధన సంబంధిత విషయమే నన్నది మనందరికి తెలిసిన విషయం. పూర్తిగా అర్ధమైందనకుకోవడం అవివేకము, అసత్యమూ గూడా. నేటి నా యీ సాహసం సూక్ష్మాన్ని గ్రహించి శ్రీరామ చంద్ర చైతన్య ప్రవంతి లో నుండుటకే నని మనవి చేసుకుంటున్నాను.

పూజ్య బాబూజీగారు ప్రశిక్షకులు పనిచేయు తీరు మరియు సాధకులు ఆచరించ వలసిన విషయాలు ఈ సందేశంలో వెల్లడించారు. ప్రశిక్షకులు యేమి చేయాలన్న విషయాన్ని వదలి వొక అభ్యాసీగా మనము యేమి చేయాలనే విషయాన్ని మనము పరిశీలిద్దాం. పైన చెప్పినటువంటి సందేశములో మనము ముఖ్యముగా

గమనించ వలసిన విశేషాలు మూడు - మనము గురువు చేతిలో నుండుట, మనిషి మనిషిగా మార్పు నొందు స్థితి మరియు గురువర్యుల కృషి - మన ఆధ్యాత్మికోభివృద్ధి.

మున్ముందుగా మనము గమనించ వలసిన పదము 'real master' - దీన్ని సమర్థ గురువు యని అమృత వర్షిణిలో అనువదించారు. ఏ పూర్వ జన్మ సుకృతమోగాని ఈనాడు ఈ దివ్య సత్యపథ మార్గమున సాధన జరుగుతోంది. మనయొక్క ఆధ్యాత్మికోభివృద్ధికి నిరంతరం కృషి జేసే ప్రశిక్షకులను యీ సందర్భాన గుర్తు చేసుకోవటం ఎంతో అవసరం. ఒక నిద్రాణమైనటువంటి స్థితి నుండి ప్రాణాహుతి ద్వారా శ్రీరామ చంద్ర చైతన్య ప్రవంతి వైపు మనని మరలించి, ఎప్పుడూ మన ఆధ్యాత్మికోభి వృద్ధికి కృషి చేసే వారు ప్రశిక్షకులు. మన ప్రియ సోదరులు పూజ్య శ్రీ కే సీ నారాయణగారి నిరంతర కృషి వల్లే యీ నాడు ఆధ్యాత్మిక సాధన సాధ్యమయి ఆధ్యాత్మికంగా కొంత ఎదగడం జరిగింది. దీనికి సర్వదా కృతజ్ఞుడై వుండెదను.

మనము 'గురువు చేతిలో' నుండుటయంటే మనసా వాచా కర్మణా నిర్ద్వంద భావనతో వారు చెప్పినవి అనుసరించడం! అంటే 'నేను', నా మిడి మిడి జ్ఞానము తో కూడిన పాండిత్య సంపత్తులను వదలుకొని గురువుగారికి లొంగిపోయి ఉపదేశించిన సాధనని గ్రహించి అవలంభించాలి. ఎవరో చెప్పారు యేదో చేస్తున్నామన్నట్టు మూఢంగా కాకుండా, ఆధ్యాత్మిక విషయాలను పరికించి సాధన చేయటం యంతో అవసరం. ఇట్టి సెమినార్లలో పాల్గొనడం వల్ల మనకు యీ విషయమై యెంతో తోడ్పడుతుందనడం యదార్థం. మరి నిర్ద్వందంగా పాటించడం అంటే మరో సిద్ధాంతమో లేక మరో గురువు నాశ్రయించ కుండా వుండడం. ఈ విధంగా ఏకోన్ముఖుడై వుండడం సాధనకి యంతో అవసరమని హృదయానికి తెలిసినా మెదడుకి తొందరగా అర్థం కాదు. "ఏ పుట్టలో ఏ పాము వుందో!" అనుకుంటూ కాలయాపన చేసి, ఎటు గాలి వీస్తే అటు వెళ్ళే గాలి పటం లా ఎవరేమి చెబితే అదిచేసి, పాండిత్యం వెళ్ళబుచ్చి ఇదే సాధన యని భ్రమలో పడు కొంతమంది వైఖరి బాధాకరం! కొంత భయం - కొంత తెలియని తనం కావచ్చునేమో! యిట్టి స్థితి ( ఏకోన్ముఖుడై వుండడం) సాధనలో ఒక మెట్టే అని గమనించగలరు. ఇది సాధన చేసేకొద్దీ వెలికి వచ్చే స్థితి.

సమర్థ గురువుల అనంతమయిన కృప వల్ల, పూజ్య బాబూజీగారి రాజయోగ పద్ధతి నేడు మనకు లభ్యమయింది. ఈ అమూల్యమయిన సాధనకై మనము ధ్యానపద్ధతులననుసరిస్తూ ఏకోన్ముఖులమై, గురుదేవుల యడల వుండాలి. ఈ విధంగా వున్నప్పుడు ప్రశిక్షకులు తమ దృడ సంకల్పముతో ప్రాణాహుతి

ద్వారా అభ్యాసీ ని వున్నత చైతన్య స్థితులకు పంపుట సులభమై, వైఖరిలో మార్పులతో సహా సహజత్వ స్థితినొందుతాము. పూజ్య బాబూజీగారు ఈ విధంగా తెలిపారు “మన హృదయమును గురుశక్తికి లక్ష్యముగా నేర్పర్చుకొన్నచో, అంతర్గతముగా వైశాల్యము హెచ్చి, కాలము గడచినకొలది భగవత్ సామ్రాజ్యమందంటా మనము వ్యాపించుచున్నట్లు తోచును.” - శ్రీరామచంద్రజీ మౌళిక రచనలు పు.132

సాధకుడు, గురువు, దైవము - ఈ విషయాన్ని గమనిస్తే ఈ మూడు సౌరమండలములోని చంద్రుడు, భూమి మరియు సూర్యునితో పోల్చవచ్చు. భూమి చంద్రుణ్ణి దగ్గరగా నుంచుకొని సూర్యుని ప్రకాశము నందజేయునట్లు ఒక ప్రశిక్షకుడు ప్రాణాహుతి యను దివ్య సాధనముతో సాధకుని లోని అంధకారమును తొలగించి భగవత్ కృపనందించును. “సత్యపథమనబడు ఈ ఆధ్యాత్మిక శిక్షణా విధానములో తొలుదొల్తనే అభ్యాసి మనస్సుయొక్క అధోముఖ గమన స్వభావమును గురువు తన స్వశక్తిచే బలహీన పరచి అది సహజముగనే దైవాభిముఖ మగునట్లు చేయును“ (శ్రీరామచంద్రజీ మౌళిక రచనలు పు.166) చంద్రుని తేజోన్ముఖము సూర్యుని ప్రసాదమే అయినట్లు, ఎట్టి ఆధ్యాత్మిక స్థితియైన కేవలం గురువిగారి కృప వల్లేలభ్యమవుతుంది! చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతున్నా భూమి సూర్యుని చుట్టూ తిరగడం వల్ల చంద్రుడు కూడా సూర్యుని చుట్టూ తిరగడం జరుగుతుంది. అదేవిధంగా సాధకుడు గురువు చెంతనుండి గురుపే దైవంగా భావించి ప్రశిక్షకులు చెప్పినట్లు సాధన చేసినట్లయితే ఆధ్యాత్మికంగా ఎదగడం తథ్యం! సాధనలో గ్రహణముల వలె ఆటంకములు వచ్చినా క్షణకాలమే నన్న విషయం గ్రహించి గురువు నీడని వదల కుండుటయే వివేకము.

మనిషి మనిషిననుపించు కోవటంలో భాగంగా సేవ చేయటం ఎంతో అవసరం. ప్రశిక్షకులు చెప్పినట్లు సాధన చేస్తూ మనము వీలయి నంత వరకు ఇంపీరియన్స్ చేపట్టే పనులలో లేక సహజ్ సేవా సంస్థాన్ చేపట్టిన ప్రాజెక్టులలో మన శక్తి మేరకు సేవాభావంతో పరహితంగా పని చేయాలి. “ఏక చంద్రః ప్రకాశేన నక్షత్రైః కిమ్ ప్రయోజనమ్?” అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. మరియు రామాయణంలో వారధి కట్టడం మేరకు ఉడుత సహాయం చేసినట్లు నడుంబిగించి వీలయినంత తోడ్పడితే సరిపోతుంది. మున్ముందు సతతస్మరణకీ తోడ్పడుతుంది.

ప్రణామములు.

- ఏలూరిపాటి రవి